సాక్షి
ఏలూరు
I
ఆదివారం । 21 । మే । 2023





చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

- భీమవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం
- కైకలూరులో ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో నిరసన



కైకలూరులో నిరసన కార్యక్రమంలో చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు



భీమవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కైకలూరు: పేదలకు ఇచ్చే సెంటు భూమి సమాధి కట్టుకోవడానికి సరిపోతుందని చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు చోట్ల శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. భీమవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేయగా, కై కలూరు ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

చంద్రబాబుకు పిచ్చాసుపత్రిలో చికిత్స అవసరం

పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నివేశన స్థలాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబుకు పిచ్చాసుపత్రిలో చికిత్స అవసరమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పేదలకు ఇచ్చిన సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవాలని హేళనగా మాట్లాడిన చంద్రబాబు మాటలను ఖండిస్తూ కైకలూరు సంత మార్కెట్ వైఎస్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు చూసి చంద్రబాబుకు నిద్రపట్టడం లేదన్నారు. పేదలకు ఇచ్చే సెంటు భూమి సమాధి కట్టుకోవడానికి సరిపోతుందని చంద్రబాబు అనడం పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. అమరావతిలో 50 వేలకు పైబడి పేద బడుగు బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే తమ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందనే దుగ్ధ మనసులో పెట్టుకుని అక్కడి ప్రజలను రెచ్చగొట్టి సుప్రీంకోర్టుకు పంపారన్నారు. తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చేసరికి జీర్ణించుకోలేక ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలకు దిగుతున్నారన్నారు. ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, మోత్రు ఏసుబాబు, తిరుమాని రమేష్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షులు జంపన కొండరాజు, పాము రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచులు దుట్టా మణి, ఉప్పలపాటి నాగమణి, ఉలిసి వసంత కుమారి, జయమంగళ కాసులు, నున్న రాంబాబు, అల్లూరి మంగరావు, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, బంటుపల్లి సాధు కొండయ్య, కో–ఆప్షన్ సభ్యుడు శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ఓర్వలేకే చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

సాక్షి, భీమవరం: పేదల ఇళ్ల నిర్మాణానికి ఏనాడూ గజం స్థలం ఇవ్వని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే ఓర్వలేకనే అవాకులు చవాకులు పేలుతున్నారని భీమవరం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కోటిపల్లి బాలకోటేశ్వరరావు (బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న సెంటు స్థలం సమాధులు కట్టుకోడానికి పనికివస్తుందంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు, విజయనర్సింహరాజు మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఏనాడు పేదల ఇళ్లనిర్మాణానికి గజం స్థలం కూడా ఇవ్వలేదని టిడ్కో ఇళ్లు పేరుతో మహానేత వైఎస్సార్ హయాంలో సేకరించిన ఇళ్ల స్థలాల్లోని పిచ్చుక గూళ్లు మాదిరిగా ఇళ్లు నిర్మించి లబ్ధిదారుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేయడానికి చూశారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టగానే టిడ్కో ఇళ్లు కొంతమందికి ఉచితంగా మిగిలిన వారికి తక్కువ ధరకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా ఒకేసారి స్థలాలిచ్చి పెద్ద మొత్తంలో ఇళ్లు నిర్మిస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారన్నారు. పేదలంతా జగన్‌కు అండగా నిలవడంతో చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనేనని గతంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని చులకనగా మాట్లాడారన్నారు. చంద్రబాబుకు రాజకీయ చరిత్ర ముగిసిందని స్పష్టం చేశారు. ముందుగా చంద్రబాబు దిష్టిబొమ్మతో ప్రకాశంచౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా శవయాత్ర నిర్వహించి అనంతరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు డౌన్‌డౌన్, జై జగన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లం రాంబాబు, గాదిరాజు తాతరాజు, మానేపల్లి నాగన్నబాబు, కోడే విజయలక్ష్మి, గొలగాని సత్యనారా యణ, గూడూరి ఓంకారం, గంటా సుందరకుమార్, పేరిచర్ల సత్యనారాయణరాజు, పెచ్చెట్టి ప్రసాద్, గుంటి ప్రభు, నామన మహేష్, తిరుమాని ధనుంజయ, కోళ్ల బాలకృష్ణ, పాలపర్తి జోనా, తాణాల రామకృష్ణ, నల్లం రఘు, తుంపాల సత్తిబాబు, మాదిరెడ్డి శ్రీనివాస్, జవ్వాది సత్తిబాబు, ఎం రామారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



కేటాయించిన రూమ్‌ను శోధిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో, ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్రం ఏలూరులో ఆరు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 8వ తరగతి వరకూ ప్రవేశాలకు 1,832 మందికి గాను 1,463 మంది పరీక్షలకు హాజరు కాగా 369 మంది గైర్హాజరయ్యారు. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 1,854 మందికి గాను 1,498 మంది విద్యార్థులు హాజరు కాగా 356 మంది గైర్హాజరయ్యారు. అలాగే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 49 మందికి గాను 34 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా స్థాయి పరిశీలకులైన డీఆర్ఓ ఒక పరీక్షా కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి రెండు పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ 6 పరీక్షా కేంద్రాలను, జిల్లా కో–ఆర్డినేటర్ 6 పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ చెప్పారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి
- విధుల్లో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేత



పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శాంతిభద్రతల పరిరక్షణ, కేసులను ఛేదించటం, విధుల్లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా నగదు, ప్రశంసాప్రతాలను శనివారం ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తూ మెరుగైన సేవలకు తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. నిడమర్రు స్టేషన్ పరిధిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను 11 మందిని అదుపులోకి తీసుకుని, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టటంలో సీసీఎస్ డీఎస్పీ, అప్పటి ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, గణపవరం సీఐ బీ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ స్వామి, హెచ్‌సీ జీవీ నాయుడు, కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, బీ.శివకుమార్, శ్రీనివాస్, సీహెచ్ ధనంజయ, హోంగార్డు పీ.జగపతిని ఎస్పీ అభినందించారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక సంఖ్యలో కేసులను రాజీ చేయడానికి కృషి చేసిన ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్, కోర్టు కానిస్టేబుల్ పీ.చిరంజీవి, నూజివీడు రూరల్ ఎస్ఐ టీ.రామకృష్ణ, కానిస్టేబుల్ సురేష్‌లకు ప్రసంశాపత్రం, నగదు పురస్కారాన్ని అందించారు. జిల్లాలో ఏడో దఫా సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపుతూ 113 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, హెచ్‌సీ రవికుమార్‌లకు ఎస్పీ నగదు బహుమతి, ప్రశంసాప్రతాన్ని అందజేశారు.

ఘాటెక్కిన అల్లం ధర

- కిలో రూ.200కు చేరిన వైనం
- పొరుగు రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడి
- నెలాఖరు నాటికి తగ్గే అవకాశం

తణుకు: అల్లం ధర ఘాటెక్కింది. నిన్నామొన్నటి వరకు కిలో ధర రూ.80 ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 పలుకుతోంది. సాధారణంగా వేసవిలో ఉల్లి, పచ్చిమిర్చి ధరలు పెరుగుతుంటాయి. అయితే ప్రస్తుతం అల్లం ధర రెండింతలు పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో అల్లం దిగుబడి తగ్గిపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచే ఎగుమతులు అవుతుండటంతో డిమాండ్ మరింత పెరిగింది. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో ధర రూ.60 నుంచి రూ.80 మాత్రమే ఉంది.

ధర పెరిగినా.. నాణ్యత లేదు

జిల్లాలో వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు నిత్యావసరాలను దిగుమతి చేసుకుంటూ ఉంటారు. ప్రధాన అపరాలతోపాటు అల్లం పెద్ద ఎత్తున దిగుమతి అవుతుంది. ఇక్కడి నుంచే జిల్లాలోని ప్రధాన కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తుంటారు. ప్రధానంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లోని అల్లం పండే ప్రాంతాల నుంచి వ్యాపారులు గూడెం మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే ఈ ఏడాది పెరిగిన వేసవి ధాటికి దిగుబడి ఒక్కసారిగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో డిమాండ్ పెరిగి దిగుబడి తగ్గింది. గతంలో వారానికి అయిదు లోడులు జిల్లాకు వస్తే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన కూరగాయల ధరలకు తోడు అల్లం ధర అనూహ్యంగా పెరుగుతుండటంతో వినియోగదారులకు మింగుడు పడటంలేదు. ఇదిలా ఉంటే ధర పెరిగినప్పటికీ నాణ్యమైన అల్లం మార్కెట్‌కు రాకపోవడంతో నాసిరకం సరుకు అందుబాటులో ఉంటోంది. ఈ నెలాఖరు నాటికి ధర తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రతి జిల్లా కేంద్రంలో హ్యాండీ క్రాఫ్ట్ బజార్

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



తెల్లిపల్లిలో గిరిజనులు తయారు చేసిన వెదురు సోఫాలో కూర్చున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

వేలేరుపాడు: రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హస్తకళల బజారు (హ్యాండీక్రాఫ్ట్ బజారు) ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు. వేలేరుపాడు మండలంలోని అటవీ ప్రాంత గ్రామాలైన తెల్లిపల్లి, టేకుపల్లి, పేరంటపల్లి, కొయిదా తదితర గ్రామాల్లో శనివారం వారు పర్యటించారు. ఈ ప్రాంత గిరిజనులకు అవసరమైన చేతివృత్తులపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో ఒక హ్యాండీ క్రాఫ్ట్ బజారు ఏర్పాటు చేసి, అందులో గిరిజన ఉత్పత్తులు విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతంలో జగనన్న మహిళా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి, మహిళలకు తోడ్పాటునందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అగరబత్తీల తయారీ, వెదురుతో వివిధ ఆకృతులతో గృహ అంకరణ వస్తువుల తయారీ, మామిడి, చింత, ఊరగాయల తయారీ, పుట్టతేనె, తయారీ యూనిట్స్, అడవిలో దొరికే అడ్డాకులతో ఇస్తరాకుల తయారీ తదితర వాటిల్లో శిక్షణ అందించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా గిరిజనులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా విద్యుత్ సౌకర్యం లేని గ్రామాల్లో సోలార్ లైట్‌లు, ఏర్పాటు చేయాలని కోరారు. కోయలు, గుత్తికోయలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, డీసీహెచ్ నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, లేపాక్షి ఎంపోరియంల ద్వారా తాము తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. అనంతరం తెల్లిపల్లి గిరిజనులు తయారు చేసిన వెదురు సోఫాలు, బుట్టలు, చాటలను పరిశీలించారు. ప్రముఖ సామాజిక వేత్త కట్టా లక్ష్మి, విజయవాడ ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సురేష్, వైటీసీ మేనేజర్ రాజు, వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర, వీఆర్వో నాగరాజు, గిరిజనులు పాపారావు, మారయ్య పాల్గొన్నారు.

పీజీటీ కౌన్సెలింగ్ పూర్తి.. 211 మందికి పోస్టింగ్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌లలో పనిచేసేందుకు అర్హత ఉండి ఆసక్తి చూపిన స్కూల్ అసిస్టెంట్‌లకు స్థానిక సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో శనివారం పీజీటీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

దీనిలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 359 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల్లోని హైస్కూల్ ప్లస్‌లలో 250 పోస్టులకు గాను 211 మందికి డీఈఓ ఎస్‌వీ రవిసాగర్ పదోన్నతులతో కూడిన పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని హైస్కూల్ ప్లస్‌లలో కామర్స్ 10 పోస్టులకు గాను ఏడుగురికి, ఎకనామిక్స్ 10 పోస్టులకు గాను 10 మందికి, సివిక్స్ 10 పోస్టులకు గాను ఐదుగురికి, బోటనీ 26 పోస్టులకు 22 మందికి, ఫిజిక్స్ 34 పోస్టులకు గాను 24 మందికి పోస్టింగులు ఇచ్చారు. అలాగే కెమిస్ట్రీ 34 పోస్టులకుగాను 21 మందికి, తెలుగు 34 పోస్టులకు గాను 29 మందికి, గణితం 25 పోస్టులకు గాను 24 మందికి, ఇంగ్లిష్ 34 పోస్టులకు గాను 32 మందికి, జువాలజీ 24 పోస్టులకు 23 మందికి పోస్టింగులు ఇచ్చారు. వీరితో పాటు ప్రభుత్వ యాజమాన్యాల్లోని హైస్కూల్ ప్లస్‌లలో ఫిజిక్స్ రెండు పోస్టులకు ఇద్దరికి, కెమిస్ట్రీ రెండు పోస్టులకు ఒకరికి, తెలుగు రెండు పోస్టులకు ఇద్దరికి, గణితం ఒక పోస్టుకు ఒకరికి, ఇంగ్లిష్ రెండు పోస్టులకు ఒకరికి, జువాలజీ రెండు పోస్టులకు ఒకరికి పోస్టింగ్ ఇచ్చారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి..

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): ఓ వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొని స్నానం కోసం చెరువులోకి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. జీలుగుమిలికి చెందిన షేక్ ఫకీర్ (50) గ్రామంలో ఓ వ్యక్తి చనిపోగా అతని అంత్యక్రియల్లో శనివారం పాల్గొన్నాడు. అనంతరం ఆ పక్కనే ఉన్న చెరువులో దిగే ప్రయత్నం చెయ్యగా ప్రమాదవశాత్తూ చెరువులో పడి మునిగి మృతి చెందాడు.

బాస్కెట్‌బాల్ బాలికల జట్టు విజేత తూర్పుగోదావరి



తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు



కృష్ణా జిల్లా బాలుర జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

- బాలుర జట్టు విజేత కృష్ణా
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్
- ఉల్లంపర్రులో ముగిసిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు మాంటిస్సోరీలో గత నాలుగురోజులుగా నిర్వహించిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి.

ఫైనల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు కృష్ణా జిల్లా బాలికల జట్టుపై 55/43 పాయింట్ల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. అలాగే కృష్ణా జిల్లా బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 62/40 పాయింట్ల తేడాతో విజయం సాధించి కవురు శ్రీనివాస్ కప్ ట్రోఫీని గెలుచుకున్నారు. విజేతలకు శుక్రవారం రాత్రి ఉల్లంపర్రు క్రీడా ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం కూడా పెంపొందించుకోవాలని, దీనికి క్రీడాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చెంగల్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, కోశాధికారి బి.రేవతి, జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, చీఫ్ కోచ్ ఎం.రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి జి శ్రీనివాస్, కోశాధికారి, కె.మురళీకృష్ణ, మాంటిస్సోరీ విద్యాసంస్థల అధిపతులు మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, మాంటిస్సోరీ స్కూల్ ప్రిన్సిపాల్ సామవేదం వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కొత్త జంటకు ఆశీర్వాదం



నరసాపురం మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కుమార్తె సుకీర్తి, రాష్ట్ర మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామమోహన్‌రావు కుమారుడు గణేష్‌ల పరిణయ నిశ్చితార్థ వేడుక శనివారం పాలకొల్లులో వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, మంత్రులు అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాల శ్రీనివాస్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.
– పాలకొల్లు అర్బన్

క్లుప్తంగా

‘ఫుట్‌బాల్’ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపీ శ్రీధర్ నియామకంపై హర్షం

పెదపాడు: ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను నియమించడంపై నియోజకవర్గంలోని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధిలో ఎన్నో ఏళ్లుగా తమవంతు కృషి చేస్తూ విదేశీ ఆటగాళ్లతో మన రాష్ట్ర ఆటగాళ్ల కలిపి ఆడించి ఆటలో మెలుకువలు నేర్పించారన్నారు. శ్రీధర్ చొరవతో ఆట ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. దీంతో ఇటీవల జరిగిన ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో క్రీడలపై ఆసక్తి, అభిరుచి కలిగిన శ్రీధర్‌ను నియమించడంపై నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ ముదుగురు సూర్యనారాయణ, జిల్లా బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు బెజవాడ నర్సింహారావు తదితరులు శ్రీధర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

తాటిచెట్టు కూలి రైతు మృతి



రాము మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పెనుగొండ: ఈదురుగాలులు ప్రారంభం కావడంతో ధాన్యం రాశిని కాపాడుకుందామని వెళ్లిన ఓ రైతును తాటి చెట్టు మృత్యురూపంలో కబళించింది. శనివారం రాత్రి సిద్ధాంతం శివారు ఘటాల దిబ్బలో పొలంలో ఉన్న ధాన్యం రాశిపై బరకాలు కప్పడానికి వెళ్లగా రాసి వద్దే ఉన్న తాడి చెట్టు ఈదురుగాలులకు ఒక్కసారిగా రైతు పులిరాము (65)పై కూలిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అతనికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ ఘటనలో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. పెనుగొండ సిఐ జీవీవీ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నూజివీడు: పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ట్రిపుల్‌ఐటీలో పనిచేసేందుకు ఆటోలో వెళుతుండగా పశువుల ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి ఏదురుగా వస్తున్న మంచినీటి వ్యాన్ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న కె.వీరమ్మ (50), ఎం అంజలి (40)లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిని హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు. పట్టణ ఎస్ఐ కే శివనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుళికలు మింగి వివాహిత ఆత్మహత్య

నూజివీడు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత శనివారం బలన్మరణానికి పాల్పడింది. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హనుమంతులగూడెంకు చెందిన రెడ్డి సూర్యకుమారి (40)కి 25 ఏళ్ల క్రితం సోమేశ్వరరావుతో వివాహమైంది. కాగా నిత్యం భర్త మద్యం తాగి గొడవపడుతుండేవాడు. భర్త ప్రవర్తనతో విసుగు చెంది శనివారం గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను హుటాహుటిన నూజివీడులోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాలివాన బీభత్సం



జట్లపాలెంలో విరిగిన చెట్టు కొమ్మలు

తాడేపల్లిగూడెం: పట్టణంలో శుక్రవారం అర్ధ రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో పిడుగులు పడటంతో ప్రజలు ఆందోళన చెందారు. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచి ఒక్కసారిగా అంధకారం నెలకొంది. తాడేపల్లిగూడెం మండలంలో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడటంతో వైర్లు తెగిపోయాయి. నియోజకవర్గం మొత్తంలో 20 వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు ఎలక్ట్రికల్ డీఈ వెంకటేశ్వరరావు చెప్పారు. పొలాల్లో విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లను శనివారం సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

తెగిన విద్యుత్ తీగలు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ఒరిగి తీగలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. శనివారం చెట్ల కొమ్మలను తొలగించగా మధ్యాహ్నం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

యానాం మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



నిందితుడు, మద్యం బాటిళ్లతో ఎస్‌ఈబీ అధికారులు

ద్వారకాతిరుమల: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని మండలంలోని రాళ్లకుంటలో అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం శనివారం చెప్పారు. యానాంకు చెందిన గంగాధర రామ్మూర్తి తన గ్రామం నుంచి ఒక కారులో రాళ్లకుంటకు మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకొస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌ఈబీ అధికారులు వలపన్ని అతడిని పట్టుకున్నారు. శనివారం రాత్రి అతడి ఇంటిపై దాడి చేసి అతని నుంచి 936 మద్యం బాటిళ్లు, ఒక కారు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ నక్క సూర్యచంద్రరావుకు అందిన సమాచారం, సూపరింటెండెంట్ అరుణకుమారి ఆదేశాల మేరకు ఈ దాడిని జరిపినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్‌ఈబీ ఎస్ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు సీతారాం, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మూర్తి, నీలాద్రిపురం జీఎంఎస్‌కే నస్రిన్ పాల్గొన్నారు.

సేవలకు సలాం

- వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు అవార్డులు
- పశ్చిమగోదావరి జిల్లాలో 8,533 మంది ఎంపిక
- ప్రోత్సాహక నగదు బహుమతులుగా రూ.8.73 కోట్లు



వలంటీర్‌కు సేవా పతకం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి ముగింటికే వెళ్లి అందించడం, పారదర్శకంగా పథకాలను లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఆయన ఆశయాలను నేరవేరుస్తూ సంక్షేమ సారథులుగా వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారు. కేవలం గౌరవ వేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వారిని ఏటా ప్రభుత్వం నగదు బహుమతులతో ప్రోత్సహిస్తూ సన్మానిస్తోంది. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పేరిట అవార్డులు అందజేస్తోంది. సేవా మిత్రకు రూ 10 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, వజ్రకు రూ 30 వేలు చొప్పున ఏటా నగదు పురస్కారం అందిస్తోంది. ఇప్పటికే రెండు విడతల పురస్కారాలు అందించిన ప్రభుత్వం ఈఏడాది మూడో విడత పురస్కారం అందించే కార్యక్రమం నిర్వహిస్తోంది.

35 మందికి వజ్ర సేవా అవార్డులు

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 9,263 వలంటీర్లు ఉండగా మూడో విడతలో అవార్డులు అందుకున్నవారు 8,533 మంది ఉన్నారు. ఈరిలో సేవా మిత్ర అవార్డు అందుకున్న వారు 8,370 మంది, సేవా రత్న అవార్డుకు 128 మంది, సేవా వజ్ర అవార్డు అందుకున్న వారు 35 మంది ఉన్నారు. ప్రభుత్వం వలంటీర్ల అవార్డుల కోసం మూడో విడత కింద రూ 8.73 కోట్లు ఖర్చుచేసింది. ఆయా నియోజకవర్గాలు, మండల స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం 19న ప్రారంభం కాగా 10 రోజుల పాటు నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిం చడమే కాక తమ సేవలను గుర్తించి ఏటా అవార్డు, నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తుండటం చాలా సంతోషంగా ఉందని వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ప్రజలకు మరింత బాధ్యతగా, ఉత్సాహంగా సేవలు అందిస్తామని వలంటీర్లు చెబుతున్నారు.



నరసాపురంలో వలంటీర్లకు నమూనా చెక్కును అందజేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

జిల్లాలో నియోజకవర్గాల వారీగా అవార్డులకు ఎంపికైన వలంటీర్ల వివరాలు

నియోజకవర్గం	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
ఆచంట	1,083	20	6
భీమవరం	1,276	17	5
నర్సాపురం	986	15	5
పాలకొల్లు	948	15	4
తణుకు	1,361	20	5
తాడేపల్లిగూడెం	1,382	16	5
ఉండి	1,334	25	5
మొత్తం	8,370	128	35

వజ్ర అవార్డు రావడం సంతోషంగా ఉంది



నేను గతంలో రెండు సార్లు సేవా మిత్ర అవార్డు అందుకున్నాను. మూడోసారి సేవా వజ్ర అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. వలంటీర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, సీఎం సార్‌కు కృతజ్ఞతలు.

– జిల్ల జీవన్‌కుమార్, వలంటీర్, ఎల్ఎన్‌పీ పురం

మరింత బాధ్యతగా సేవలందిస్తా



నేను రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. నా సేవలు గుర్తించి ప్రభుత్వం ఇప్పుడు వజ్ర అవార్డు అందించడం సంతోషంగా ఉంది. సీఎం సార్ ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా సేవలు అందిస్తాను. వలంటీర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యునిగా చూడడం అదృష్టంగా భావిస్తున్నాను.

– ధనాల సోమేశ్వరరావు, వలంటీర్, 18వ వార్డు, భీమవరం

సేవ చేసే అవకాశం కలిగింది



రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. మూడోసారి సేవా రత్న అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతి ఏడాది వలంటీర్లకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటం గొప్ప విషయం. నా పరిధిలో కుటుంబాలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తా

– జంగం మేరి, వలంటీర్, 21వ వార్డు, భీమవరం

ఘాటెక్కిన అల్లం ధర

తణుకు: అల్లం ధర ఘాటెక్కింది. నిన్నామొన్నటి వరకు కిలో ధర రూ.80 ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 పలుకుతోంది. సాధారణంగా వేసవిలో ఉల్లి, పచ్చిమిర్చి ధరలు పెరుగుతుంటాయి. అయితే ప్రస్తుతం అల్లం ధర రెండింతలు పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో అల్లం దిగుబడి తగ్గిపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచే ఎగుమతులు అవుతుండటంతో డిమాండ్ మరింత పెరిగింది. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో ధర రూ.60 నుంచి రూ.80 మాత్రమే ఉంది.

ధర పెరిగిన నాణ్యత లేదు

జిల్లా వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ప్రధాన అపరాలతోపాటు అల్లం పెద్ద ఎత్తున దిగుమతి అవుతుంది. ఇక్కడి నుంచే జిల్లాలోని ప్రధాన కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తుంటారు. ప్రధానంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లోని అల్లం పండే ప్రాంతాల నుంచి వ్యాపారులు గూడెం మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే ఈ ఏడాది పెరిగిన వేసవి ధాటికి దిగుబడి ఒక్కసారిగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో డిమాండ్ పెరిగి దిగుబడి తగ్గింది. గతంలో వారానికి అయిదు లోడులు జిల్లాకు వస్తే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. ధర పెరిగినప్పటికీ నాణ్యమైన అల్లం మార్కెట్‌కు రాకపోవడంతో నాసిరకం సరుకు అందుబాటులో ఉంటోంది.

గడపగడపకు సంక్షేమం



గణపవరం: పిప్పర గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



జంగారెడ్డిగూడెం రూరల్: చిన్నావారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

సమన్వయంతో మానవ అక్రమ రవాణా నిరోధం



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు అన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాసదన్ భవన్‌లో మానవ అక్రమ రవాణా, ఉమెన్ గ్రీవెన్స్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే వివిధ రకాల సేవలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో పేదరికంలో ఉన్న ప్రజలు తమ అవసరాల నిమిత్తం బాండెడ్ లేబర్‌గా మారుతున్నారని వీటిని నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలబాలికలు వివిధ రకాలుగా అక్రమ రవాణా జరుగుతుందని దీనిని నిరోధించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ బాధితులకు ప్రభుత్వ పరంగా వివిధ రకాల షెల్టర్లలో ఆశ్రయం కల్పిస్తున్నారని, వారికి సంబంధిత ప్రాంతాలలో వెల్ఫేర్ హాస్టల్స్‌లో స్థానం కల్పించి విద్యాబోధన చేయాలన్నారు. మానవ అక్రమ రవాణాను నిరోధించే విషయంలో ఏ ప్రభుత్వ శాఖకైనా ఏ విధమైన న్యాయపరమైన సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ మూర్తి, శాశ్వత సమస్యల పరిష్కార ప్రజాపీఠం చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి, డీసీపీఓ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

సీఐపీఈటీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ)/నూజివీడు: విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను డిప్లమో, పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఐపీఈటీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శనివారం తాడేపల్లిగూడెంలో జాయింట్ డైరెక్టర్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్, ప్రతినిధి కె.సుందరరావు, నూజివీడు నుంచి విడుదల చేసిన ప్రకటనలో ప్రొఫెసర్ పానుగంటి శివన్నారాయణ కోరారు. తాడేపల్లిగూడెంలో శనివారం వారు వివరాలను వెల్లడించారు. మూడు సంవత్సరాలు వ్యవధిగల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులకు పదో తరగతి పాస్, చదువుతున్న విద్యార్థులు, రెండేళ్ల వ్యవధితో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ పాస్, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి ఈ నెల 28వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏపీలో విజయవాడ, అనంతపురం కేంద్రాలలో జూన్ 11న అడ్మిషన్ టెస్ట్ ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. ఏపీ నిబంధనలు అనుసరించి అర్హులైన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. అన్ని కోర్సులకు ప్లాస్టిక్, అనుబంధ సంస్థలలో క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా దేశ విదేశాలలో ప్లాస్టిక్ వస్తువుల తయారీ, మౌల్డ్ తయారీ, టెస్టింగ్ అండ్ క్వాలిటీ నిర్ధారణ రంగాలలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులు కె.సుందర్‌రావు 93980 50255 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొండెక్కిన కోడి ధర



చికెన్ దుకాణం

గణపవరం: వేసవి ఉష్ణోగ్రతలతోపాటు చికెన్ ధరలు వినియోగదారులకు చుక్కలను చూపుతున్నాయి. గత పది రోజులుగా చికెన్ ధరలు కొండెక్కాయి. ఒక్కసారిగా కిలోకు రూ.100 నుంచి రూ.120కు పెరిగింది. దీంతో మాంసాహార ప్రియులు పెదవి విరుస్తున్నారు. గత పదిరోజులక్రితం కిలో స్కిన్‌లెస్ బాయిలర్ ధర రూ.170 నుంచి రూ.180 ఉండగా, ఫారం కోడి మాంసం కిలో రూ.130 నుంచి రూ.140 పలికింది. వేసవి ప్రభావంతో పదిరోజులుగా కిలో చికెన్ ధర రూ.280 నుంచి రూ.300కు, ఫారం కోడి మాంసం కిలో రూ.180 నుంచి రూ.200 అమ్ముతున్నారు. సహజంగానే వేసవిలో చికెన్ ధరలు కొంత మేర పెరుగుతాయి. వేసవిలో కోళ్ల పెంపకం ఒడిదుడుకులతో సాగుతుంది. కోళ్లకు వ్యాధులు సోకడం, ఎండల తీవ్రతకు సరిగా ఆహారం తీసుకోక మాంసం ఉత్పత్తి తగ్గడం తదితర కారణాల వల్ల చికెన్ ధరలు కొద్దిగా పెరుగుతాయి. అయితే అనూహ్యంగా చికెన్ ధర ఒక్కసారిగా 50 శాతం మేర పెరగడంతో మాంసాహార ప్రియులు నిట్టూరుస్తున్నారు. జిహ్వాచాపల్యం వదులుకోలేక, వేసవి సెలవులకు బంధువుల రాక తదితర కారణాలవల్ల తప్పనిపరిస్థితిలో చికెన్‌కొనక తప్పడం లేదని, అయితే కొనుగోలు సగానికి సగం తగ్గించకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

గుడ్డు ధరా అదేబాటలో..

గుడ్డు ధర కూడా చికెన్ ధరతో పోటీ పడుతోంది. ఈ నెల మొదటివారం వరకూ అట్ట కోడిగుడ్ల ధర రూ.120 పలకగా, ప్రస్తుతం రూ.150 విక్రయిస్తున్నారు. అటు చికెన్ ధరలు, ఇటు గుడ్డు ధరలూ ఒకేసారి పెరిగిపోవడంతో మాంసాహార ప్రియులు ఆందోళనకు గురవుతున్నారు.

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోను వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున క్షేత్రానికి విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

22న సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కామవరపుకోట: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపికలో భాగంగా ఈ నెల 22న కామవరపుకోట జెడ్పీ హైస్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మిడతా రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2006వ తేదీ తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా తన వెంట తెచ్చుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26 నుంచి 28 వరకు కడప జిల్లా రాయచోటి సుందనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ మానుకొండ సుబ్బారావు సెల్ 94933 39424 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.